విధ్వంస రాజకీయం

సాగునీటి ప్రాజెక్టులపై ప్రజాభవన్‌లో ప్రజెంటేషన్‌లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులు

మేడిగడ్డపై సర్కారు దండయాత్ర

మొదటిపేజీ తరువాయి...

ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పరిశీలించ లేదు. అలాగే ఎన్‌డీఎస్‌ఏ నుంచి ప్రత్యేకంగా బరాజ్‌ను సందర్శించలేదు. త్వరలోనే ప్రత్యేక కమిటీని వేస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించలేదు. పిల్లర్లు ఎందుకు కుంగాయి? నిర్మాణ లోపమా? నేచర్ ఎఫెక్టా? కారకులు ఎవరు? అనే విషయమై టెక్నికల్‌గా ఎలాంటి విచారణ జరుగ లేదు. కేవలం ప్రాథమిక విచారణ ఆధారంగానే ప్రాజెక్టుపై రాజకీయం చేస్తూ దీన్ని పక్కన పెట్టే కుట్రలకు ప్రభుత్వం తెరలేపింది. కృష్ణా నదిపై నిర్మించిన నీటిపారుదల ప్రాజెక్టులు, సంబంధిత ఇతర వ్యవస్థలను రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ ఈ నెల 13న నల్లగొండలో భారీ బహిరంగ సభకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం అదే రోజు కాళేశ్వరంపై దండయాత్రకు పూనుకొన్నది. ఇప్పటికే ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లను పరిశీలించారు. మేడిగడ్డలో సమీక్ష నిర్వహించి, విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. విచారణకు ప్రత్యేక కమిటీ వేస్తామని ప్రకటించి విజిలెన్స్ విచారణతో కాలం గడుపుతున్నారు. అయినా, మళ్లీ కావాలనే సీఎం రేవంత్.. మేడిగడ్డకు తన మంత్రి వర్గాన్ని, ఎమ్మెల్యేలు, రాష్ట్ర అధికార యంత్రాంగంతో దండయాత్రకు వస్తున్నారు. దీనిని బట్టి బరాజ్‌లపై రాజకీయ కుట్రలు ఏ మేరకు జరుగుతున్నాయో అవగతమవుతున్నది. ప్రాజెక్టు ఇంజినీర్లను మానసిక క్షోభకు గురి చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

నోడల్ అధికారిగా సుధాకర్‌రెడ్డి

కాళేశ్వరం ఎత్తిపోతల (రామగుండం) ఈఎన్సీ వెంకటేశ్వర్లును తొలిగించిన ప్రభుత్వం కే సుధాకర్‌రెడ్డిని నోడల్ అధికారిగా నియమించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో సుధాకర్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారని, మేడిగడ్డ బరాజ్ నిర్మాణం లోనూ ఆయన పాత్ర ఉన్నదని, అయినా అతడికి మళ్లీ నోడల్ అధికారిగా బాధ్యతలు ఎలా అప్పగించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెడ్డి సామాజికవర్గానికి చెందడం వల్లే ఆ పగ్గాలు అప్పగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు మేడిగడ్డను సందర్శించగా, ఈఎన్సీ మురళీధర్ ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టు పరిస్థితిని పూర్తిస్థాయిలో వివరించారు. దీంతో సంతృప్తి చెందని మంత్రులు మంగళవారం ప్రత్యేక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం ప్రత్యేకంగా స్క్రీన్‌తోపాటు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం.

ప్రాజెక్టు అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అధికారులతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున మేడిగడ్డకు విచ్చేస్తున్న సందర్భంగా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, ప్రొటోకాల్ విషయంలో ఎలాంటి సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ మేడిగడ్డను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

సీఎం స్థాయిలోనే కుట్ర?

కాళేశ్వరం ప్రాజెక్టులో గోదావరిజలాలను ఎత్తిపోసే అవకాశం ఉన్న దరిమిలా రానున్న వేసవిలో సమస్య తలెత్తకుండా, పంటలు వేసుకున్న వారికి చివరి దశలో సాగునీటి సమస్య రాకుండా పది టీఎంసీలనైనా ఎత్తిపోసుకుందామని నీటిపారుదల శాఖ ఇంజినీర్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సూచించినట్టు తెలిసింది. ఇది నిజమే కదా..అనుకొని మంత్రి ఉత్తమ్ ఇదే విషయాన్ని సీఎం రేవంత్ ముందు ప్రస్తావించినట్టు సమాచారం. అయితే అలా చేస్తే కాళేశ్వరం ప్రాజెక్టు రన్నింగ్‌లో ఉన్నట్టు అవుతుంది.. అందుకే దానిని ముట్టుకోకండి! అని సీఎం రేవంత్‌రెడ్డి తెగేసి చెప్పినట్టు తెలిసింది. అంటే నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా... ఉద్దేశపూర్వకంగా దానిని పక్కన పడేయడం వల్ల కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరంతో ఒక చుక్క కూడా ఎత్తిపోయడం లేదని రాజకీయంగా ప్రచారం చేసుకోవాలనే దురాలోచన ఉన్నదనేది స్పష్టమవుతున్నది.

- కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ గొప్పగా చెప్పుకునే నాగార్జునసాగర్ కుడి హెడ్‌రెగ్యులేటర్ 1980వ దశకంలో కుంగిపోయింది. ఎన్టీఆర్ ప్రభుత్వం ఆ లోపాన్ని సరిచేసి రైతులకు సాగునీరు అందించింది. అప్పుడు ఎన్టీఆర్ రాజకీయమే పరమావధి అనుకుంటే మరమ్మతులు చేయకుండా లక్షల మంది రైతులను పణంగా పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేసి ఉండొచ్చు. కానీ అలా చేయలేదు.
- కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్ జలయజ్ఞం కింద చేపట్టింది. ప్రాజెక్టులోని ఎల్లూరు పంప్‌హౌజ్‌లోకి వరద నీరు వచ్చి పంపులన్నీ కుప్పకూలిపోయాయి. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక ఇబ్బందులు అధిగమించి ఆ లోపాలను సరిచేసి ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చింది. రెండు లక్షల ఎకరాల్లో పాలమూరు బిడ్డలు సిరులు పండించేలా చేసింది. ఇక్కడా కేసీఆర్ ప్రభుత్వం రాజకీయమే చేయాలనుకుంటే పాలమూరు పచ్చబడేదా?
- కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ సహా జలయజ్ఞం కింద చేపట్టిన అనేక పెండింగ్ ప్రాజెక్టులను కేసీఆర్ ప్రభుత్వం తొలి రెండుమూడేండ్లలోనే రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చింది. అవి పూర్తిచేస్తే కాంగ్రెస్‌కే పేరు వస్తుందని కేసీఆర్ రాజకీయ కుంచితత్వంతో ఆలోచన చేసి ఉంటే ధాన్యసిరుల్లో తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచేదా?
- ఇదే కాంగ్రెస్ హయాంలో దేవాదుల టన్నెల్ కుప్పకూలి పలువురి ప్రాణాలు పోయాయి. అయినా ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆ లోపాలను గుర్తించి మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందించాయి. ఇప్పుడు రేవంత్ సర్కారు మాత్రం తెలంగాణ రైతును రాజకీయ బలిపీఠంపై నిలిపింది. అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా మేడిగడ్డ లోపం ఏందో నిగ్గు తేల్చకుండా, బాధ్యులపై చర్యలు తీసుకోకుండా, కేసీఆర్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నది. 'కాళేశ్వరంపై విచారణకు సిద్ధమే... లోపమేందో గుర్తించి, బాధ్యులపై కచ్చితంగా చర్యలు తీసుకోండి' అని నీటిపారుదల శాఖ మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలోనే సీఎంకు చెప్పారు. అయినా సమగ్ర విచారణపై రేవంత్ ప్రభుత్వం అడుగులు ముందుకు వేయడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మేడిగడ్డ మాత్రమేనన్న భ్రమలో నీటి నిల్వలు ఉన్నా సాగు ప్రణాళికను విస్మరించారు. 'ఇప్పుడు నీటిని ఎత్తిపోస్తే కాళేశ్వరం ప్రాజెక్టుకు పేరు వస్తుందనే ఆలోచిస్తున్నారుగానీ... నీటిని ఎత్తిపోయకుంటే గత ఏడాదిని బేరీజు వేసుకొని రేవంత్ సర్కారు రాగానే పొలాలు ఎండబెట్టారనే అపవాదు వస్తుంది' అనే చిన్న లాజిక్‌ను మాత్రం మిస్సవుతున్నారు.

లాజిక్ లేని విజిలెన్స్ నివేదిక

మేడిగడ్డపై విచారణ చేసిన విజిలెన్స్ విభాగం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అందులో కొన్ని వివరాలు గందరగోళంగా ఉన్నాయని నిపుణులు చెప్తున్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎగ్జిక్యూట్ మాత్రమే చేస్తారు. ఏజెన్సీతో ఒప్పందం చేసుకునేది ఎస్ఈ. ఈ క్రమంలో ఎస్ఈ ఇచ్చే కంప్లిషన్ సర్టిఫికెట్ చెల్లుతుంది గానీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇచ్చే కంప్లిషన్ సర్టిఫికెట్ ఎలా చెల్లుతుందనేది నివేదిక రూపొందించిన వారే చెప్పాలి. అసలు ఎందుకు కుంగిందనేదానిపై నిర్దిష్టమైన కారణాలు నివేదికలో లేవని నిపుణులు అంటున్నారు. కుంగుబాటుకు కారణాలేమిటి? దానికి బాధ్యులెవరు? అనే కనీస ముక్తాయింపు (కన్‌క్లూజన్స్) లేకుండా విజిలెన్స్ నివేదిక ఉన్నదని చెప్తున్నారు. దీంతో విజిలెన్స్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకునే పరిస్థితి కూడా లేదని సాగునీటి రంగ నిపుణుడు ఒకరు అభిప్రాయపడ్డారు. అంటే రెండు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై ఏమీ తేల్చలేదని స్పష్టమవుతున్నది. వాస్తవానికి ఇప్పటికే ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ నిపుణులను రప్పించి బరాజ్‌పై ఏం చేయాలి? అనే దానిపై నివేదిక తీసుకోవాల్సి ఉన్నది. కానీ ప్రభుత్వానికి దానిని పునరుద్ధరించకుండా రాజకీయ డ్రామా నడిపే వేదికగా మాత్రమే వినియోగించుకోవాలనే ఆలోచన ఉన్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంకో ప్రమాదకరమైన అడుగులు కూడా వేసేందుకు రేవంత్ ప్రభుత్వం వెనుకడుగు వేయడంలేదని పలువురు ఇంజినీర్లు అనుమానిస్తున్నారు. మరమ్మతులు చేయకుండా బరాజ్‌ను అలాగే వదిలివేయడం ద్వారా రానున్న వర్షాకాలం సీజన్‌లో భారీ వరదలు వచ్చి మరింత కుంగి, కొట్టుకుపోయేలా చేస్తే కేసీఆర్ ప్రభుత్వాన్ని మరింత బద్నాం చేయొచ్చనే కుట్ర కూడా జరుగుతున్నదని అంటున్నారు. దీంతో రైతుల ప్రయోజనాలు, ప్రజల ఆస్తులను రక్షించాలనే ప్రాథమిక బాధ్యతను సైతం విస్మరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇప్పటికీ మేడిగడ్డ వద్ద ప్రవాహం

ఇప్పటికీ మేడిగడ్డ వద్ద ప్రాణహితలో ప్రవాహం కొనసాగుతున్నది. శనివారం మధ్యాహ్నం కూడా 6,210 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఈ క్రమంలో మేడిగడ్డ నుంచి అన్నారం అటు నుంచి సుందిల్లకు నీటిని ఎత్తిపోసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అంతెందుకు.. పొద్దునలేస్తే కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించే వీఆర్ఎస్ తీసుకున్న ఒక ఐఏఎస్ కూడా బరాజ్ లేకుండా నీటిని లిఫ్ట్ చేయొచ్చు అని గతంలోనే సెలవిచ్చారు. టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన దేవాదుల ప్రాజెక్టులో కూడా ఎలాంటి నిల్వ లేకుండా కేవలం ఇన్‌టేక్ పాయింట్ వద్ద చిన్న పాటి గుంతలో నీటిని నిల్వ చేసి ఎత్తిపోశారు. దీంతో ఇప్పుడు మేడిగడ్డ వద్ద కూడా నీటిని ఎత్తిపోసేందుకు సాంకేతికంగా అవకాశాలున్నాయి. ఎలాగూ అన్నారంలో 2.56 టీఎంసీలు, సుందిల్లలో 2.13 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. రానున్న వేసవిలో సాగు, తాగునీటికి ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, ఎల్‌ఎండీ కీలకం కానున్నాయి. ఈ క్రమంలో ఇప్పుడు వాటిలో నిల్వలు పెంచుకోవడం, దిగువ వరకు చెరువులు నింపుకొంటే వచ్చే వానాకాలం వరకు ఎలాంటి సమస్య ఉండదు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేసింది కూడా ఇదే. అందుకే మండు వేసవిలో కూడా చెరువుల్లో జలసిరి కనిపించింది. ఈ వాస్తవం తెలిసినా అలా చేస్తే కేసీఆర్ ప్రభుత్వానికి పేరు వస్తుందనే దుగ్ధతో రేవంత్ సర్కారు తెలంగాణ రైతుల ప్రయోజనాలను పణంగా పెడుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రకటించి వెనక్కి తగ్గిన అధికారులు

రేవంత్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రైతుల నడ్డి విరుస్తున్నదనేందుకు సాగునీటి ప్రణాళిక-అమలే ఉదాహరణ. ప్రతి సీజన్‌కు ముందు నీటిపారుదల శాఖ ఇంజినీర్లు ప్రాజెక్టులవారీగా నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు, డెడ్‌స్టోరేజీ వంటివి బేరీజు వేసుకొని ఆయా ప్రాజెక్టుల కింద ఎంత ఆయకట్టుకు సాగునీరు ఇస్తామనేదానిపై సివం (స్టేట్‌లెవల్ కమిటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ వాటర్ ప్లానింగ్ మేనేజ్‌మెంట్) సమావేశంలో చర్చించి, నిర్ణయిస్తారు. దానికి అనుగుణంగానే సాగునీటి విడుదల ఉంటుంది. గత నవంబర్‌లోనే యాసంగికి సంబంధించి ఎస్సారెస్పీ స్టేజ్-1లో పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీటిని అందిస్తామని ప్రకటించారు. కానీ రేవంత్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాత్రం స్టేజ్-1 కింద ఉన్న మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించడం గమనార్హం. పైగా స్టేజ్-2కు కూడా అరకొరగానే సాగునీటిని అందిస్తున్నారు. అంటే రేవంత్ ప్రభుత్వం కొలువుదీరిన రోజు నుంచి ఉద్దేశపూర్వకంగా ఎస్సారెస్పీ కింద ఉన్న ఆయకట్టును ఎండబెడితేనే కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయొచ్చనే దురాలోచన చేస్తున్నట్టుగా అర్థమవుతున్నది.

బడ్జెట్‌లో బట్టబయలు

శనివారం అసెంబ్లీ వేదికగా ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కాళేశ్వరం ప్రాజెక్టును నిరర్థక ఆస్తిగా భావిస్తున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బరాజ్‌లు మాత్రమే కాదనే వాస్తవాన్ని మాత్రం ప్రభుత్వం గుర్తించడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టును నిరర్థక ఆస్తిగా భావిస్తున్న దరిమిలా... ముమ్మందు చేపట్టే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో కాళేశ్వరంలో అంతర్భాగమైన నిర్మాణాలను వినియోగించబోమనే ప్రకటన కూడా చేసి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. కేసీఆర్ హయాంలో పూర్తయిన లక్ష్మి, గాయత్రి పంప్‌హౌజ్‌లు, మిడ్‌మానేరు వంటివి కూడా నిరర్థక ఆస్తులు అయినందున వాటితో నిమిత్తం లేకుండానే ప్రాణహిత-చేవెళ్లను ముందుకు తీసుకుపోతే తెలంగాణ సమాజం హర్షిస్తుందని అంటున్నారు.

అయోధ్యపై బీజేపీ రాజకీయం

- రామాలయంపై పార్లమెంట్‌లో తీర్మానం తప్ప
- బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): అయోధ్య రామాలయాన్ని బీజేపీ రాజకీయం చేస్తున్నదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు మండిపడ్డారు. ఆదివారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం ప్రజా సమస్యలను పక్కనపెట్టి అయోధ్య గురించి పార్లమెంట్‌లో చర్చ పెట్టి తీర్మానం చేయడాన్ని తప్పుబట్టారు. అయితే సభాపతి అధికారాన్ని తాను తప్పుబట్టడం లేదని స్పష్టంచేశారు. ఎన్నిక లొస్తున్నాయి కాబట్టే బీజేపీ రామాలయాన్ని, రాముడిని రాజకీయం చేస్తున్నదని మండిపడ్డారు. అయోధ్య గుడికి వెళ్లినివారు దేశ వ్యతిరేకులు కాదని పేర్కొన్నారు. అయోధ్య గుడి గురించి మాట్లాడుతున్న మోదీ.. తెలంగాణలోని అతిపెద్ద దేవాలయం యాదగిరిగుట్ట గురించి ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడం బాధాకరమని చెప్పారు. ఎంపీ వెంకటేశ్ నేత బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడంపై స్పందిస్తూ.. తమ అవసరాలకు అనుగుణంగా నేతలు పార్టీలు మారుతూ ఉంటారని ఎద్దేవా చేశారు. వెంకటేశ్ కాంగ్రెస్‌లో చేరిన తర్వాత బీఆర్ఎస్‌పై తప్పుడు ఆరోపణలు చేశారని దుయ్యబట్టారు. ప్రధానంగా బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని ఆరోపించడం బాధించిందని చెప్పారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజాతీర్పులను బట్టి మారుతూ ఉంటుందనే విషయం గుర్తుపెట్టుకోవాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజార్టీ స్థానాలు గెలుస్తుందని, మిగతా చోట్ల గట్టి పోటీ ఇస్తుందన్న ధీమా వ్యక్తంచేశారు.

ప్రజలు అంత అమాయకులా?

మేడిగడ్డ కుంగుబాటుకు కారణాలు, బాధ్యులు, చర్యలు.. ఈ కోణంలో రాష్ట్ర ప్రభుత్వ అడుగులు పడాల్సి ఉండగా, కేసీఆర్ వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బ కొట్టేందుకు రేవంత్ ప్రభుత్వం దుస్సాహసం చేస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకే కేసీఆర్ ఇంజినీర్‌లా రూపొందించిన మేడిగడ్డ కుంగిపోయిందంటూ వెటకారాలు దట్టిస్తున్నారు. వాస్తవానికి సీఎం, మంత్రులు రూట్‌మ్యాప్ ఇస్తే, అధికారులు దానిని అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా సెలవిచ్చారు. ఈ క్రమంలో రీడిజైనింగ్‌లో భాగంగా మేడిగడ్డ వద్ద బరాజ్ ఖరారైన తర్వాత అక్కడి నుంచి ఎల్లంపల్లికి జలాలను తరలించడంపై వ్యాప్కోస్ రాడార్ సర్వే చేపట్టింది. ఈ అలైన్‌మెంట్‌లో 22 క్లిష్టమైన పాయింట్స్ ఉన్నట్టు తేలింది. పెద్దపల్లి నుంచి మంథని కొత్త రహదారి, మేరుపల్లి, గుంటూరుపల్లి, రుద్రారం, చిన ఓదాల, పెద్ద ఓదాల, గోపాలపురం, రామకృష్ణాపురం, రామాపురం, రత్నాపూర్, ఇత్వార్‌పేట్, గుండారం, సబితారం, రనపురం, బ్రాహ్మణపల్లి, రాగేదర్, కొత్తపల్లి, పాలకుర్తి, బాక్రావ్‌పల్లి, పుత్నూరు, మానేరు నదిని క్రాస్‌చేసే చోట కష్టతరంగా ఉన్నదని గుర్తించారు. దీంతో ఎలా ముందుకుపోవాలనే దానిపై జరిగిన మథనంలో అప్పటి సీఎం కేసీఆర్ నదీమార్గంలోనే ఎగువకు తరలిస్తే నిత్యం నదిలో జలసిరి ఉండటంతో పాటు భూసేకరణ వంటి కీలక అడ్డంకి ఉండదని సూచించారు. దీంతోపాటు నిత్యం జీవనదిలా ఉండటం వల్ల పర్యాటకం, మత్స్యసంపద.. ఇలా వివిధ రంగాలకూ జీవం పోసినట్టవుతుందనే సదుద్దేశంతో ఈ డిజైన్‌ను ఖరారు చేశారు. విశ్రాంత ఇంజినీర్ హన్మంతరావుతో పాటు సీడబ్ల్యూసీ చైర్మన్, ఇతర నిపుణులు ఎందరో దీనిని ప్రశంసించారు. అయితే ఈ ఆలోచనను సాంకేతికంగా ముందుకు తీసుకుపోయే బాధ్యత ఇంజినీర్లపై ఉంటుంది. ఈ క్రమంలో లోపం తలెత్తినపుడు అదెందుకు జరిగింది? దానికి బాధ్యులెవరు? అనే దానిపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలి గానీ కేసీఆర్ స్ట్రక్చరల్ ఇంజినీర్, ఆ ఇంజినీర్, మేడిగడ్డ కుంగిందంటూ రేవంత్‌రెడ్డి పదేపదే వ్యంగ్యంగా వ్యాఖ్యానించి, కేసీఆర్ ప్రతిష్ఠను తగ్గించాలనే విఫలయత్నం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముమ్మందు రేవంత్‌రెడ్డి కూడా తన విజన్‌ను వివరించి, అధికారుల ద్వారా అమలు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో తలెత్తే లోపాలకు ఆయనే పూర్తి స్థాయి బాధ్యత వహిస్తారా? రెండు రోజుల కిందట అసెంబ్లీలో సీఎం రేవంత్ మాట్లాడుతూ... ఔటర్ రింగు రోడ్డు వరకు అర్బన్, ఔటర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు సెమీ అర్బన్, ఆపై గ్రామీణం అంటూ తన అభివృద్ధి విజన్‌ను వివరించారు. మరి రేవంత్‌రెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ విభాగ నిపుణుడేమీ కాదు. సివిల్ ఇంజినీర్ అంతకంటే కాదు. భవిష్యత్తులో ఈ విజన్ విజయవంతమైతే తానే రూపకర్తను అని చెప్పుకుంటారనడంలో సందేహం లేదు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి చేసిన శంకుస్థాపనతో సైబర్ టవర్ నిర్మించి, ఐటీ రంగంలో హైదరాబాద్‌ను తానే ప్రపంచ పటంలో పెట్టానన్న ఓ నేత మాటలు ఇంకా మన చెవుల్లో మారుమోగుతూనే ఉన్నాయి. అంతమాత్రాన సదరు నాయకుడు ఐటీ రంగ నిపుణుడు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఏమీ కాదు.. ఐటీ కంపెనీ నీతఓ అంతకన్నా కాదు అని నిపుణులు గుర్తుచేస్తున్నారు.

ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

చరిత్రను కనుమరుగు చేసే కుట్ర

- రాష్ట్రచిహ్నం నుంచి కాకతీయ తోరణం, చార్మినార్ గుర్తును తొలగిస్తే ఊరుకోం: వినోద్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): క్యాబినెట్‌లో చర్చించి రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాన్ని మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడాన్ని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఖండించారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ చిత్రాలను తొలగించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో టీఎస్‌టీఎస్సీ మాజీ చైర్మన్ చిరుమల్ల రాజేశ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ రాచరిక చిహ్నాలని సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి మాట్లాడటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కాకతీయులు రాచరిక వ్యవస్థ నుంచి వచ్చిన వాళ్లు కాదని, పేదల కోసం పని చేసిన వారని చెప్పారు. తెలంగాణ వచ్చాక పదేండ్లలో కేసీఆర్ చెరువులు, కుంటలను మిషన్ కాకతీయ ద్వారా అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. కాకతీయులు అణగారిన బీసీ కులానికి చెందిన వారుగా చరిత్రకారులు చెప్పుంటారని తెలిపారు. 800 ఏండ్ల కాకతీయుల చరిత్రకు నిదర్శనమైన కాకతీయ కళాతోరణాన్ని తొలగిస్తామమంటూ సీఎం ఆలోచన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సారనాథ్ స్థూపంపై ఉన్న మూడు సింహాలు, అశోక చక్రం చిహ్నాలను భారతదేశ చిహ్నంలో తీసుకున్నారని, మరి అవి రాచరిక వ్యవస్థకు సంకేతం కాదా అని వినోద్‌కుమార్ ప్రశ్నించారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ వ్యవసాయాన్ని, తెలంగాణ భాషను, యాసను, తెలంగాణ చరిత్రను తుడిచివేయాలని ఆంధ్రపాలకులు అనుకున్నారని గుర్తుచేశారు. సీఎం తీరును చూస్తుంటే తెలంగాణ చరిత్రను కనుమరుగు చేయాలని భావిస్తున్నట్టున్నారని అనుమానం వ్యక్తంచేశారు. ఇంకా రేవంత్‌లో టీడీపీ లక్షణాలు పోయినట్టు అనిపించడం లేదని విమర్శించారు. కాకతీయులు పాలించిన ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కొండా సురేఖ, సీతక్క మంత్రులుగా ఉన్నారని, సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వారు స్పందించాలని డిమాండ్ చేశారు.

పార్టీ మారేది లేదు.. కేసీఆర్ వెంటే ఉంటా

- చలో నల్లగొండ సభకు భారీగా తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్, ఫిబ్రవరి 11: మాజీ సీఎం కేసీఆర్ వెంటే ఉంటూ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని, ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ వీడే ప్రసక్తి లేదని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కొడంగల్‌లో 'చలో నల్లగొండ' పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కొడంగల్ అభివృద్ధికి రూ.950 కోట్ల నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 60 రోజుల్లోనే కేంద్రానికి ప్రాజెక్టులను అప్పగించడం చాలా బాధాకరమని చెప్పారు. తెలంగాణ ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగింతను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఈ నెల 13న నల్లగొండలో చేపట్టిన సభకు ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

మిల్లర్ల 'కస్టోడియన్' మెలిక

- టెండర్ దక్కించుకున్న వాళ్లకు ధాన్యం అప్పగించేందుకు మిల్లర్లు ససేమిరా
- కస్టోడియన్ చార్జీల కింద క్వింటాలుకు రూ. 500 చొప్పున ఇవ్వాలని డిమాండ్
- కలెక్టర్లకు మిల్లర్ల లేఖలు
- ప్రభుత్వం అంగీకరించకుంటే మళ్లీ కోర్టుకు వెళ్తామని హెచ్చరిక

హైదరాబాద్, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ): తమవద్దనున్న ధాన్యాన్ని ప్రభుత్వానికి ఊరికనే వెనక్కి ఇచ్చేందుకు మిల్లర్లు ససేమిరా అంటున్నారు. నెలల తరబడి ధాన్యాన్ని జాగ్రత్తగా కాపాడినందుకు కస్టోడియన్ చార్జీల కింద క్వింటాలుకు రూ. 500 చొప్పున చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు అసోసియేషన్ తరపున ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు అందించారు. 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి 35 లక్షల టన్నుల ధాన్యాన్ని వేలం ద్వారా విక్రయించేందుకు పౌరసరఫరాలశాఖ టెండర్లు పిలిచింది. టెక్నికల్ బిడ్‌ను శనివారం ఓపెన్ చేయగా, సోమవారం ఫైనాన్షియల్ బిడ్‌ను ఓపెన్ చేయనుంది. ఎక్కువ ధరకు కోట్ చేసిన వారికి ధాన్యాన్ని అప్పగించనుంది. ఈ నేపథ్యంలో మిల్లర్లు కొత్త మెలిక పెట్టారు